ప్రజాశక్తి
మంగళవారం 12 సెప్టెంబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

లొంగిపోయిన మావోయిస్టుకు రూ.16.55 లక్షలు ఆర్థిక సహాయం

చెక్కును ఇస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: లొంగిపోయిన మాజీ మావోయిస్టు ఎం.జలందర్ రెడ్డికి ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంటు గ్యారంటీ ప్రోగ్రాంలో భాగంగా రూ .16.55 లక్షల ఆర్థిక సహాయం చెక్కును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఆయన కార్యాలయంలో అందజేసారు. రూ.4.13 లక్షల సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. ట్రాక్టర్ కొనుగోలు చేసుకుంటే పనులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎల్.భాను చందర్, ఎల్డిఎం రవి తేజ, ఫీల్డ్ ఆఫీసర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

విష జ్వరాలతో మంచం పట్టిన బిజగూడ

-కుండీలోని కలుషిత నీరే ఆధారం- డ్రైనేజీ వ్యవస్థ లేక అస్తవ్యస్తంగా మురుగు నీరు

జ్వరంతో బాధపడుతున్న గిరిజనుడు

జ్వరంతో బాధపడుతున్న గిరిజనుడు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: విషజ్వరాలు విజృంభించడంతో గిరిజనులు వణికి పోతున్నారు. వైద్య సేవలు అందక రోగులు ఇంటింటా మంచం పట్టిన దుస్థితి మండలంలోని బస్కి పంచాయితీ బిజగూడ గ్రామంలో నెలకొంది. నెల రోజులుగా ఆ గ్రామంలో విషజ్వరాలు వ్యాపించడంతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నా, వైద్య అధికారులు కనీసం స్పందించకపోవడం దారుణం.

బిజగూడ గ్రామంలో గ్రామంలో సుమారు 35 గిరిజన పివిటిజి కుటుంబాలు జీవిస్తున్నారు. కలుషిత నీరు తాగడం, గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి పోవడంతో దోమలు బెడద ఎక్కువైంది.దీంతోనే, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో ఇద్దరు ముగ్గురు చిన్న పిల్లలతో సహా తల నొప్పులు, జ్వరం, కాళ్ళవాపు, ముఖం వాపు రావడం వంటి వ్యాధి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని బస్కి పంచాయితీ బిజగుడ గ్రామంలో మంచి తాగు నీరు సమస్య తీవ్రంగా ఉంది. గతంలో ఊట గడ్డ నుండి గ్రావిటి స్కీంతో మంచి నీరు ట్యాంక్ నిర్మించారు. ప్రస్తుతం ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థలో చేరడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పూర్తిగా బురద నీరు ట్యాంక్లో చేరుతుంది. దీంతో, నీరు కలుషిత అవుతుంది. గ్రామంలో మంచినీరు లేక ఆ కలుషితమై నీరు తాగి అనారోగ్యాలు పాలవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి గ్రావిటి పథకం మరమ్మతు చేపట్టి మంచినీరు అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అపరిశు ధ్యంగా ఉన్న కుండీ

వ్యాధుల బారిన పడిన వారిలో కిల్లో సబ్బ(50), కిల్లో కొండమ్మ(45), కిల్లో దంబ్రి (45), కిల్లో సుత్తి (46), కిల్లో భాస్కరరావు (26), కిల్లో సుబ్బారావు(22), కొర్ర సన్యాసిరావు (38), కిల్లో మసురు(40), కిల్లో శివ (10), కిల్లో అనూష (18), కిల్లో కుసుమ(70),కిల్లో ఈశ్వరరావు (28). కిల్లో సీతమ్మ (28), కిల్లో దీక్షిత (4), కిల్లో దేవి(25), జి యశ్వంత్ (3), కిల్లో ఉంబ్రు (52), కిల్లో రూత (3),మోహన్ (8), మరో ఇద్దరు కిల్లో లక్ష్మి(48) సోదేపల్లి గాని అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఇంటిలో ఒకరు ఇద్దరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారు. వైద్య అధికారులు చొరవ చూపి గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు మందులు పంపిణీ చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

బురదమయంగా గ్రామం

ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న కలెక్టర్

క్రికెటర్ రవణిని ప్రోత్సహిస్తాం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అంధుల అంతర్జాతీయ క్రికెటర్ రవణిని అన్ని విధాల ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఆమె కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. హుకుంపేట మండలం మెరక చింత పంచాయితీ రంగసింగపాడు గ్రామానికి చెందిన రవణి అంధుల అంతర్జాతీయ క్రికెట్లో సత్తాచాటి భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ను కలిసి తన క్రీడా ప్రయాణాన్ని జిల్లా కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియ జేసారు. రవణి క్రికెట్లో రాణించడం మన్యానికి గర్వకారణమన్నారు. డిగ్రీ వరకు చదువు కోవాలని సూచించారు. తాను కూడా క్రికెట్ ఆడతానని క్రికెట్పై ఆసక్తి ఎలా కలిగిందని అడిగారు. పాఠశాలలో టీచర్, ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో ముందుగా అథ్లెటిక్స్, ఆతరువాత క్రికెట్పై ఆసక్తి కలిగిందని ఆమె చెప్పింది.ప్రతీ పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరింది. . ప్రభుత్వం తరుపున సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. రవణికి క్రికెట్లో సహకారం అందించే విధంగా నోడల్ కలెక్టర్కు లేఖ రాస్తామన్నారు. వెంటనే కడప క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్కు ఫోన్ చేసి రవణి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ శతక బుల్లిబాబు, రవణి తలిదండ్రులు గోపాల క్రిష్ణ, చిట్టెమ్మ, గిరిజన సంఘం నాయకులు క్రిష్ణారావు పాల్గొన్నారు.

పాడేరులోనకిలీ ధ్రువపత్రాన్ని దగ్ధం చేస్తున్న బాలదేవ్

నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు దగ్ధం

- జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
-ఆదివాసి గిరిజన సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా అరకువేలి మండలం పెద్దలబుడు గ్రామ పంచాయతీ సచివాలయం-1 పరిధిలో అరకు వేలి టౌన్ షిప్ కొండవీదిలో నివాసముంటున్న పిట్టల రాంబాబు కాపు బీసీ (డీ) వ్యక్తికి ఇటీవల 29న అరకు వేలి తహసిల్దార్ కార్యాలయం నుండి ఎస్టీ భగత కుల ధ్రువీకరణ పత్రం అక్రమంగా పొందారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి .సత్యనారాయణ తెలిపారు. దీన్ని వ్యతిరేకిస్తూ మండల నాయకులు చిట్టిబాబుతో కలిసి ఆ కుల ధృవీకరణ ప్రతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆదివాసి షెడ్యూల్ ప్రాంతంలో వ్యాపారం నిమిత్తం నివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనేతరులు ఆదివాసి హక్కులను, చట్టాలను ధిక్కరించి లాడ్జిలు, పెద్ద భవనాలు, వ్యాపార సముదాయాలు నిర్మాణం చేపట్టడమే కాకుండా నేరుగా నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందడం అత్యంత దుర్మార్గమన్నారు. అరకు వేలి మండలం పెదలబుడు పంచాయితీలో అరకువేలి టౌన్షిప్లో గిరిజనేతరులు రెవిన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారన్నారు. పిట్టల రాంబాబు కాపు కులానికి చెందిన గిరిజనేతరుడని, పిట్టల ఇంటి పేరుతో ఆదివాసి భగత తెగలో అరకు వేలి మండలంలో 14 పంచాయితీల పరిధిలో ఎవరు లేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వెంకటరావు, చిరు, కొండబాబు, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

అరకులో దగ్ధం చేస్తున్న బాలదేవ్, నేతలు

అరకులోయ రూరల్:గిరిజనేతరుడుకి ఇచ్చిన కుల ధృవీకరణ పత్రం పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు.సోమవారం అరకువేలి మండలంలోని సరభగుడా గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నకిలీ కుల ధృవీకరణ పత్రాలు దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, అరకువేలి టౌన్షిప్ లో కొండవీధి లో నివాసం ఉంటున్న గిరిజనేతరుడైన పిట్టల రాంబాబుకు ఎస్టీ భగత కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపితే మరిన్ని నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు.ఒడిస్సా రాష్ట్రం నుండి అనేక మంది గిరిజనేతరులు పాడేరు ఐటిడిఏ పరిధిలో నివాసం ఏర్పాటు చేసుకుని ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు పొంది ఆదివాసుల రిజర్వేషన్లు, రాయితీలు, సంక్షేమ పథకాలు పొందుతున్నారని తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కిల్లో జగన్నాథం, కొర్ర మగ్గన్న, పాంగి రాము, గ్రామస్తులు కొర్ర సద్దు, మాదల మొస్య, కిల్లో దొంబు, గోపాల్, బురిడీ అర్జున్, కోటేశ్వరరావు, కిల్లో ప్రసాద్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అరకులోయ మండలంలో రెవెన్యూ శాఖ అధికారులు నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాన్ని జారీ చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నకిలీ ఎస్టికుల దవపత్రాన్ని దద్దం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లాఉపాధ్య క్షులు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, 1/70చట్టానికి విరుద్ధంగా ఆదివాసీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పి.డొంబు, పి.మోహన్ దాస్, కె.అర్జున్, పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ సోమవారం ఆ పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బంద్లో భాగంగా అల్లూరి జిల్లాలో బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంద్ నేపథ్యంలో పలువురు నేతలను గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులు చేశారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యాన పాడేరులో ర్యాలీ చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - పాడేరు :- తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్, రిమాండ్లను నిరసిస్తూ టిడిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన రాష్ట్ర బంద్ అల్లూరి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది.. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బంద్ నిర్వహించారు. జనసేన, సిపిఐ, పార్టీలు బందుకు మద్దతు ఇచ్చాయి. బంద్ సందర్భంగా పాడేరులో వర్తక వాణిజ్య సంస్థలన్నీ మూతపడ్డాయి.. ప్రైవేటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు యధావిధిగా నడిచాయి. బంద్ సందర్భంగా పోలీసులు భారీగా మోహరించి విస్తతంగా బందోబస్తు నిర్వహించారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేశారు. పాడేరులో బందుకు స్వచ్ఛందంగా అందరూ ముందుకు వచ్చారని చంద్రబాబు అరెస్టును సర్వత్రా వ్యతిరేకిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే టిడిపి పాడేరు నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కుట్ర పూరితంగానే చంద్రబాబును అరెస్టు రిమాండ్ చేశారని విమర్శించారు. రాష్ట్రంలో అరాచకమైన అసంబద్ధ పాలన జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనకు అంతిమ ఘడియలు సమీపించాయని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రోబ్బి రాము, బాకూరు వెంకటరమణ రాజు, పాంగి పాండురంగ స్వామి పాల్గొన్నారు.

అనంతగిరిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

- మూతపడిన వర్తక వాణిజ్య సంస్థలు
- నిలిచిన ప్రైవేటు వాహనాలు

హుకుంపేట:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త బంద్ ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు విజయవంతంగా కొనసాగింది. హెూటల్స్, టిఫిన్ దుకాణాలు మూతబడ్డాయి.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొర్ర తులసిరావు, మాజీ డిసిసి ఛైర్మన్ శెట్టి లక్ష్మణుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ సాగర సుబ్బారావు, సర్పంచులు వెంకటరమణరాజు, పాండురంగ స్వామి, సత్యనారాయణ, హుకుంపేట ఎంపీటీసీ కొమ్మ రమ, మండల ప్రధాన కార్యదర్శి సిరగం సూర్యకాంతం, యూనిట్ ఇన్చార్జిలు సోమేలి లక్ష్మయ్య, కంబిడి జ్ఞాన ప్రకాష్, కొర్ర వాసుదేవ్, కామేశ్వరరావు పాల్గొన్నారు

అనంతగిరి:మండల కేంద్రంలో చేపట్టిన బంద్ పాక్షికంగా జరిగింది. బస్సులతో పాటు ఇతర వాహనాలు యధావిధిగా నడిచాయి. దుకాణాలు 10 గంటల నుండి తెరుచుకున్నాయి. మండల కేంద్రంలో వారపు సంత యధావిధిగా కొనసాగింది. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు ముకద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా వైస్ ఛైర్ పర్సన్ కె. అప్పారావు, మండల అధ్యక్షులు టి.బుజ్జిబాబు, మండల నాయకులు లక్ష్మణరావు, ఎస్.దొన్ను, .ఆనంద్ పాల్గొన్నారు

జి.మాడుగుల:మండల కేంద్రంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమరి చిట్టిబాబు ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ప్రైవేటు జీపులు, ఆటోలు నిలిచాయి. వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకోగా ఆర్టీసీ బస్సులు యధావిధిగా తిరిగాయి. ప్రధాన కూడలిలో పోలీసులు భారీగా మోహరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలో పాక్షికంగా బంద్ జరిగింది. మండలంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు యధావిధిగా నడిచాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు కూడా యధావిధిగా కొనసాగాయి. మండల కేంద్రంలో పెట్రోల్ బంకు తెరుచుకోగా, కిరాణా దుకాణాలు మూతబడ్డాయి. అరకు కించమండతో పాటు ఇతర గ్రామాల్లో యధావిధిగా అన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. స్థానిక టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావును, టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామిను పోలీసులు సోమవారం ఉదయం గృహ నిర్బంధం చేశారు. ఎస్సై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విఆర్.పురంలో ఆందోళనలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

రంపచోడవరం ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం : టిడిపి బంద్ సందర్భంగా రంపచోడవరంలో వ్యాపార వాణిజ్య సంస్థల యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడ్డాయి. బంద్ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు ఉదయం నుండి రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్లో మాజీ ఎమ్మెల్యేలు చిన్నం బాబు రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్ల సునీత, కారం సురేష్ బాబు, అనంత మోహన్, వెంకట్, అడబాల బాపిరాజు, సీతంశెట్టి రత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే హౌస్ అరెస్టు

బంద్ సందర్భంగా రంపచోడవరం టిడిపి ఇన్ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి బంద్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో కలిసి బయలుదేరగా, పోలీసులు ఆమెను క్యాంపు కార్యాలయం నుండి బయటకు రాకుండా హౌస్ అరెస్టు చేశారు. అనంతరం జనసేన పార్టీ నేతలు వంతల రాజేశ్వరిని కలిసి బంద్కు సంఘీభావం తెలియజేశారు.

చింతూరు : టిడిపి రాష్ట్ర బంద్లో భాగంగా చింతూరులో సంపూర్ణ బంద్ జరిగింది. ఈ బందుకు, సిపిఐ, జనసేన పార్టీలు సంఘీభావం తెలియజేశాయి. వ్యాపారస్తులు తమ దుకాణాలను, హోటళ్లు, ఆయిల్ బంక్లను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. సినిమా హాల్లో ఉదయం ఆట, మ్యాట్నీ షో నిలిపివేశారు. పోలీసులు 144 సెక్షన్ అమలు పరచడంతో సభలు సమావేశాలు ఎవరు నిర్వహించలేదు. బంద్ ఏడుగురాళ్లపల్లి, మోతుగూడెం, చట్టి గ్రామాల్లో స్వచ్ఛందంగా వ్యాపారస్తులందరూ పాటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇల్లా చిన్నారెడ్డి, ఓబిళ్లనేనీ రామారావు చౌదరి, గడ్డం సురేష్ చౌదరి, శీలం తమ్మయ్య, శ్రీరామ్, పొదిలి రామారావు, శ్రీను, బాలు, పసుపులేటి సాల్మన్ రాజు, ఓబిళ్లనేనీ నరసింహారావు, మహమ్మద్ రియాజ్, కట్టా శంకర్, భాస్కర్రావు పాల్గొన్నారు.

బంద్తో నిర్మానుషంగా ఉన్న చింతూరు రోడ్డు, నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

కార్యకర్తలతో కలిసి బంద్కు బయలుదేరిన రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి

విఆర్.పురం : విఆర్ పురంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. స్వచందంగా దుకాణాలు , కిరాణా కొట్టులు మూసివేశారు. జనసేన, సిపిఎం నాయకులు బంద్కు మద్దతు తెలిపారు. మండలంలోని రేఖపల్లి ఎన్టీఆర్ జంక్షన్లో నిరసన తెలియజేశారు. జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, టిడిపి నాయకులు వాళ్ల కృష్ణారెడ్డి, ముత్యాల రామారావు, సిపిఎం నాయకులు మాట్లాడారు. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు ప్రకాష్, అచ్చిరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరెస్టులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - పాడేరు : పాడేరు: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న టిడిపి నాయకుల అరెస్టులు, గృహ నిర్బంధాలను సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస తీవ్రంగా ఖండించారు సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, టిడిపి అధినేత మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం ఇచ్చిన రాష్ట్ర బంద్ సందర్భంగా అనేకచోట్ల టిడిపి నాయకుల్ని అరెస్టులు చేశారని, పలువుర్ని గృహనిర్బంధంలో ఉంచారన్నారు. నిరసన ప్రజాస్వామిక హక్కని, ఈ నిర్బంధాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. శాంతియుత నిరసనలపై నిర్బంధం ప్రయోగించడం అమానుషమని అరెస్టు చేసినవారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు చేస్తున్న వారిని అక్రమ అరెస్టులు చేయటం సరికాదని సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ తప్పుపట్టారు. సోమవారం చింతపల్లి లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ,హక్కుల కోసం నిరసనలు తెలియజేస్తున్న వారిపై అమానుసంగా అరెస్టులు చేయించడం పద్ధతి కాదని అన్నారు.

పలువురు ఖండన

పాడేరు టౌన్: వైసిపితో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని జనసేన అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వంపూరు గంగులయ్య విలేకర్లకు తెలిపారు. ప్రతిపక్షాల ఉనికిని లేకుండా చేయాలని కుట్ర చేస్తున్నారన్నారు.. ప్రాథమిక ఆధారాలను కూడా చూపించకుండా అర్ధరాత్రి అరెస్టల విధానం ఏపిలో అవలంభిస్తున్నారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసిన విధానం దారుణమని ఎస్టి కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం తెలిపారు. ఆయన్ని అదుపులోకి తీసుకున్న విధానం అన్యాయమన్నారు.అరెస్టు సమయంలో సరైన విధానాలూ పాటించకపోవడం వైసిపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. కేవలం వ్యక్తిగత కక్ష సాధింపుతోనే చంద్రబాబుని అవమానాలకు గురిచేస్తూ అరెస్టు చేశారన్నారు.

టిడిపి నేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి వారి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తునామని మాజీమంత్రి కిడారి శ్రావణ్ విలేకర్లకు తెలిపారు. చంద్రబాబును పోలీసులు అరెస్టు చేసిన తీరు బాధాకరమన్నారు. వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేయడం, రాజకీయ కక్షతో కేసులు పెట్టి ఆనందం పొందడమేనన్నారు.ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

రెడ్‌క్రాస్ అంబులెన్సు ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు :ఆపదలో ఉన్న గిరిజనులకు అత్యవసర వైద్య సేవలు అందించడానికి రెడ్ క్రాస్ అంబులెన్సు సేవలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ నిధులు రూ.25 లక్షలతో కొనుగోలు చేసిన కొత్త అంబులెన్సును జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ సంయుక్తంగా సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబులెన్సును కెజిహెచ్‌లో ఉన్న ట్రైబల్ సెల్‌కు కేటాయిస్తున్నామని చెప్పారు. అత్యవసర వైద్య సేవలు అందించడానికి, పార్థివ దేహాలు తరలించడానికి వినియోగించాలని నిర్వాహకులను ఆదేశించారు. గిరిజనులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ లోహితాస్, సభ్యులు పి. సూర్యారావు, సంజీవి పాల్గొన్నారు.

ఫారం 6,7,8 ప్రక్రియ పూర్తి చేయండి

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 15 లోగా ఫారం 6,7,8 ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుండి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో ఓటరు నమోదు, తొలగింపులు, వంద ఏళ్ళు పైబడిన ఓటర్లు, ఒకే నివాసంలో ఉన్న 10 మంది ఓటర్ల పరిశీలన, పి.ఎం. కిసాన్, జనన ధృవీకరణ పత్రాల జారీపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎఆర్‌ఓలు ఓటరు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేసారు. నిర్దేశించిన సమయానికి అన్ని పనులు పూర్తి చేయాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారులు, తహశీల్దార్లు సమన్వయంతో పని చేసి అర్హత కలిగిన రైతులకు రైతు భరోసా పి.ఎం. కిసాన్ పథకాలను అందించాలన్నారు. 389 గ్రామాల్లో అసైన్డ్ ల్యాండ్ వెరిఫికేషన్ చేయాల్సి ఉందని, వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకి జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, డిఆర్ఓ పి. అంబేద్కర్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, 22 మండలాల రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న సర్పంచ్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పౌష్టికాహారం తీసుకోవడం తోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కంద్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి చెప్పారు. స్థానిక అంగన్వాడి కేంద్రంలో సోమవారం సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద గిరిజనులకు రక్తహీనత వంటి వ్యాధులకు గురి కాకుండా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.ఆనందరావు, మహిళా పోలీస్ బి సునీత, వార్డు సభ్యులు లచ్చన్న, రాజబాబు, అంగన్వాడీ టీచర్ సుశీల పాల్గొన్నారు

గిరిజనులకు ప్రభుత్వ సేవలందించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:గిరిజనులకు ప్రభుత్వ సేవలందించడమే సచివాలయం సిబ్బంది లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. జిల్లా లోని ఎంపిడి ఓలు, ఉపాధిహామీ అధికారులు, మండల విద్యాశాఖాధికారులతో సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ జాబ్ కార్డులు జారీ, ఆర్ఓఎఫ్ఆర్ భూములకు ఉపాధిహామీ పథకంతో అనుసంధానం, పంచాయతీ కార్యదర్శుల హాజరు నివేదికలు, జనన దవీకరణ పత్రాలు జారీ, ఆధార్ కేంద్రాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధిహామీ జాబ్ కార్డుదారులకు పెద్ద ఎత్తున పనులు కల్పించాలని చెప్పారు. ఏ కారణాల చేతనైనా జాబ్ కార్డు తొలగిస్తే తిరిగి జాబ్ కార్డులు జారీ చేయాలని సూచించారు. జిల్లాలో 12500 మందికి జనన ధృవీకరణ పత్రాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సమర్ధవంతంగా అమలు చేయడానికి ఎఎన్ ఎంలతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఎ ఎన్ఎంలు గ్రామాల్లో పర్యటించి వ్యాధులను గుర్తించాలన్నారు. ఆధార్ కేంద్రంలో ప్రతీ రోజు 25 మందికి సేవలందించాలని ఆదేశించారు. డిజిటల్ అసిస్టెంట్ల వద్ద ఉన్న ప్రభుత్వ డబ్బును సకాలంలో జమ చేయాలని స్పష్టం చేసారు. జమ చేయకపోతే డిజిటల్ అసిస్టెంట్ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చింతూరు, దేవీపట్నం, జి.కె. వీధి, మారేడుమిల్లి, ఎటపాక, పెదబయలు, వై.రామవరం మండలాల ఎంపిడి ఓలు పంచాయతీ కార్యదర్శుల అటెండెన్స్ సమర్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో డిఎల్‌డిఓ శాంతలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, ఉపాధిహామీ ఎపిడి జె.గిరిబాబు, గ్రామ వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నివాసాలు పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు:వైద్యుల నివాస సముదాయాల నిర్మాణాలను అక్టోబరు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక మలేరియా కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న వైద్యాధికారుల నివాస గృహాల నిర్మాణపు పనులను ఐటిడిఏ పిఓ వి. అభిషేక్ తో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యుల నివాస గృహాల నిర్మాణాలకు మరో 15 లక్షల నిధులు విడుదల చేస్తామన్నారు. భవన నిర్మాణాలలో ఎక్కడా రాజీ లేకుండా పటిష్టమైన నాణ్యతలు పాటించాలని స్పష్టం చేసారు. వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకుని రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, డిఇ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కార్యాలయ పనులు పూర్తిచేయాలి : ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట:అసంపూర్తిగా నిలిచిన హుకుంపేట తహశీల్దార్ కార్యాలయం నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ ఆదేశాలు జారీ చేసారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ కొంత నిధులు విడుదల చేస్తామని చెప్పారని, మరికొన్ని నిధులు ఐటిడిఏ నుండి విడుదల చేస్తామని చెప్పారు. అక్టోబరు నెలాఖరు నాటికి భవనాన్ని పూర్తి చేసి అప్పగించాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గతంలో అర్బన్ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారని అధికారులు పిఓ కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ వెంకటరావు, గిరిజన సంక్షేమ శాఖ ఎఇ ధ్రువకుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : కలెక్టర్

పాడేరు:విద్యా రంగంలో గిరిజన ప్రాంతం వెనుకబడి ఉందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, 2011 జనగణన ప్రకారం ఏజెన్సీలో 53 శాతం అక్షరాస్యత ఉందన్నారు. మహిళల అక్షరాస్యత 39 శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఈనెల 9న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారని చెప్పారు. ఏజెన్సీలో 10 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారని వారందరు పాఠశాలలకు సక్రమంగా హాజరు కావాలన్నారు. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్ విభాగాలు, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించి నిర్దిష్టమైన సమయానికి విధులకు హాజరు కావాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమయానికి వచ్చి ఫేషియల్ అటెండెన్సు వేయాలన్నారు. ఎవరిపైనా అన్యాయంగా చర్యలు తీసుకోమంత్నారు. విద్యా వాలంటీర్లను నియమించుకోవలసిన అవసరం ఉందన్నారు.

ఘాట్ రోడ్డు మీదుగా జెసిబిని తరలిస్తున్న ట్రాలీ లారీ

ఘాట్ రోడ్డులో భారీ వాహనాల తరలింపు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రమాదాలకు నిలయంగా ఉన్న అనంతగిరి ఘాట్ రోడ్డులో భారీ జెసిబిలను అరుకు, ఒరిస్సా ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలోని శివలింగపురం, టైడా, డముకు, బొర్రా జంక్షన్, అనంతగిరి, బీసుపురం, అరకు మండలం సుంకరమెట్ట, బల్లుగుడ. వరకు 9 హెయిర్ పిన్ మలుపులతో కూడిన ఘాట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో భారీ బరువుతో కూడిన వాహనాలు మలుపుల వద్ద ప్రయాణం కష్టతరమే. ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులు, రైల్వే రెండవ లైన్ రోడ్డు పనుల నిమిత్తం సోమవారం భారీ జెసిబిలు తరలించారు. ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితమే ఘాట్ రోడ్డు రెండో మలుపు వద్ద సిమెంట్ లోడుతో ఉన్న తారస్ లారీ నిలిచి పోవడంతో రెండు రోజులుగా రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ భారీ వాహనాలతో ఈ ఘాట్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల వ్యాప్తంగా ఏకధాటిగా సోమవారం కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. మండలంలోని అతి మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం పంచాయితీ కేంద్ర సమీపంలోని లక్ష్మీపురం బ్రిడ్జి పై నుంచి వరద నీటి ప్రవాహంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బిర్రిగూడ గ్రామ సమీపంలో నిర్మాణా పనులు చేపడుతున్న బ్రిడ్జి వద్ద ప్రయాణికులను ఒడ్డు వద్దకు దించారు. బ్రిడ్జి నిర్మాణ పనులకు ఉపయోగిస్తున్న జెసిపి సహాయంతో స్థానికులను కాపాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని గతంలో స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ అనేక మార్లు స్పందనలో అధికారులకు అర్జీలు సమర్పించారు. ఈ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి 3 కోట్ల 27 లక్షల మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. లక్ష్మీపురం గ్రామ పరిధిలో వంతెనను, ముత్త గుమ్మి గ్రామ సమీపంలో బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెనపై నుంచి ప్రవహిస్తున్న నీరు

కెజిహెచ్‌లో పిల్లలకు ఉచితంగా గుండె పరీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జిల్లా ఎర్లీ ఇంటర్వేషన్ సెంటర్, నేషనల్ హెల్త్ మిషన్, ఆర్‌బిఎస్‌కె, శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ సంయుక్త నిర్వహణలో సోమవారం కెజిహెచ్‌లో ఉచిత పిడియాట్రిక్ కార్డియాలజీ క్యాంపు నిర్వహించారు. 0 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలకు గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు, 2-డిఇసిహెచ్ఒ స్కాన్ చేశారు. గుండెకు సంబంధించిన వ్యాధులో నిర్ధారించిన పిల్లలకు ఉచిత వైద్య చికిత్స, అవసరమైన వారికి తిరుపతిలో ఉచితంగా శస్త్ర చికిత్సలను, తిరుమల తిరుపతి దేవస్థానం, ప్రార్థన ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తామని శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హృదయచంద్ర (శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్) తెలిపారు. కమిషన్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె, డిఇఐసి ఆఫీసర్ డాక్టర్ ఎన్‌వి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో జ్ఞానేశ్వరరావు ప్రతిభ

ప్రజాశక్తి -అనందపురం: జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని కనమాం పంచాయితీ ఎర్రవానిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి అరిగి జ్ఞానేశ్వరరావు ప్రతిభ చూపాడు. ఈ నెల 8, 9,10 తేదీల్లో మహారాష్ట్ర, పూణేలో బాలెవాడి స్టేడియంలో జరిగిన 12వ జాతీయస్థాయి బయతిల్ (రన్నింగ్,స్విమ్మింగ్), త్రయతిల్ (రన్నింగ్,షూటింగ్, స్విమ్మింగ్) పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్-9 కేటగిరిలో పోటీపడిమంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. పాల్గొన్న రెండు ఈవెంట్లలోనూ విజేతగా నిలిచాడు.

నాలుగో తరగతి చదువుతున్న జ్ఞానేశ్వర్‌కు చిన్నతనం నుంచే ఆటపాటలపై మక్కువ ఉండడంతో అతని. తల్లిదండ్రులు అరిగి సంతోష్ ప్రశాంతి, సంతోష్ తమ బిడ్డకు చదువతోపాటు పాటు స్విమ్మింగ్ నేర్పించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాకుండా జాతీయ స్థాయిలోనే రాణించేటట్లుగా తీర్చిదిద్దారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జ్ఞానేశ్వరరావును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు వైసిపి నేత పినిశెట్టి సింహాచలం నాయుడు, గ్రామ పెద్దలు అభినందించారు

రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యం

- 10వ వార్డు వైసిపి నేతలతో ఎంవివి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని విశాఖ ఎంపి, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం లాసన్స్ బే కాలనీ క్యాంపు కార్యాలయంలో 10వ వార్డు వైసిపి ముఖ్యనేతలతో వార్డు అధ్యక్షుడు జగ్గుపిల్లి అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇప్పటికే 10వ వార్డులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. వైసిపి మహిళ జిల్లా అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి, ఎపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన 19వ వార్డు పెదజాలారి పేట బాపూజీనగర్‌కు చెందిన చింతపల్లి నీలారావు కుటుంబాన్ని ఎంపి పరామర్శించి, కొంత నగదు సాయం అందజేశారు. 19వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్, వార్డు అధ్యక్షుడు వాడామోదుల గణేష్ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో గడపగడపకు...

28వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ ఎంవివి పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి- సీతమ్మధార : గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వివిధ పనులపై వచ్చే పేదల ఆకలిని తీర్చేందుకు మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం ప్రారంభించారు.జివిఎంసి 53వ వార్డు జాతీయరహదారిపై ఆర్‌అండ్‌బి జంక్షన్ బస్‌స్టాప్, శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, పల్లెల నుంచి వచ్చే పేదల కోసం మెప్మా ఆధ్వర్యంలో తక్కువ ధరకే భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆహా క్యాంటీన్ ప్రారంభించిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహాక్యాంటీన్ ద్వారా మినీ మీల్స్ రూపంలో కరేపాకు, సాంబారు, లెమన్, ఆవకాయ రైస్, పెరుగు అన్నంతో కూడిన శాకాహార భోజనాన్ని తక్కువ ధరకే అందిస్తున్నారన్నారు.కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పిఒ శ్రీలక్ష్మి, ఎపిడి పద్మావతి, టిపిఆర్ఒ శైలజ,పైడి శ్రీను, షేక్‌బాబ్జి, సదరం జ్ఞానేశ్, పైడి ప్రతాప్, నబి, సుజాత, భాను, సంపత్, అలీ, వల్లి, ఆర్‌పిలు పాల్గొన్నారు.

వైసిపి కక్ష సాధింపు మానుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన, రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు పట్ల సిఐడి పోలీసులు వ్యవహరించిన తీరు, అరెస్ట్ చేసిన విధానం వైసిపి ప్రభుత్వ అనైతిక చర్యలకు అద్దం పడుతోందని తెలుగు శక్తి అధ్యక్షులు బివి రామ్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వైసిపి ప్రభుత్వం ఈ తరహా కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు

శ్రీనగర్ కార్పొరేషన్‌ను జివిఎంసి బృందం సందర్శన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి కార్పొరేటర్ల బృందం స్టడీ టూర్‌లో భాగంగా జమ్ము కశ్మీర్‌లోని శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆధ్వర్యంలోని కార్పొరేటర్ల బృందం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ మేయర్ జునైద్ అజీమ్ మత్తు జివిఎంసి మేయర్ బృందానికి సంప్రదాయ పద్ధతిలో సాదర స్వాగతం పలికారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శ్రీనగర్ కార్పొరేషన్ చేపడుతున్న అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ మొదలైనవి అంశాలపై వివరించారు.

అనంతరం గ్రేటర్ విశాఖలో చేపడుతున్న ఇకో వైజాగ్ కార్యక్రమం, పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, కాలుష్యం నియంత్రణ, ప్లాస్టిక్ నిర్మూలన, వీధిదీపాల నిర్వహణ, పార్కుల అభివృద్ధి, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఇతరత్రా అంశాలపై విశాఖ నగర మేయర్ హరివెంకటకుమారి వివరించారు. కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్‌లీడర్లు, డిపిఒ చక్రవర్తి, ఇతర అధికారులు, శ్రీనగర్ మున్సిపాలిటీ జాయింట్ కమిషనర్, స్మార్ట్‌సిటీ మేనేజర్, అధికారులు, పాల్గొన్నారు.

శ్రీనగర్ కార్పొరేషన్‌లో మేయర్ గొలగాని, కార్పొరేటర్ల బృందం

విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు

ఎయు విసి ఆచార్య ప్రసాద రెడ్డి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎయు విసి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచన జరపాలని ఎయు విసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు రచించిన 'ఫిలసాఫికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత షారోన్ రాజును అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌తరం ఉపాధ్యాయులుగా నిలిచే వారికి ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. దేశంలో ఉపాధ్యాయ వృత్తి, విస్తృతి, 21వ శతాబ్దంలో ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆవశ్యకత, డిజిటల్ కాలంలో బోధన, ఎన్‌సిటిఇ విధానాలు, విలువలతో కూడిన విద్యావ్యవస్థ, విద్యలో ఐసిటి వినియోగం తదితర అంశాలను పుస్తకంలో రచయిత విపులంగా వివరించారు. పరిశోధకులకు ఈ పుస్తకం ఒక చక్కని మార్గదర్శిగా నిలుస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య రాంజీ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం

ప్రజాశక్తి-పెందుర్తి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేసే విధానం పూర్తిగా అప్రజాస్వామికమని బిఎస్‌పి జిల్లా అధ్యక్షుడు బోను కృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ శిక్షించాల్సిందేనని, విపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో సిఐడి అధికారులు వ్యవహరించిన తీరు ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. నాలుగున్నరేళ్లుగా అరాచకాలతోనే వైసిపి పాలన సాగిస్తోందన్నారు. ప్రజలు అధికారమిచ్చింది అభివృద్ధి చేయడానికే తప్ప, కక్ష సాధింపులకు కాదన్న విషయం గుర్తెరగాలని హితవు పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు బంగారి రమణ, మండల అధ్యక్షులు కాకర ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు

'శ్రీకనకమహాలక్ష్మి' హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఆగస్టు 9 నుంచి సెప్టెంబర్ 11 వరకు హుండీ ద్వారా వచ్చిన కానుకలను సోమవారం లెక్కించారు. నగదు రూ.24,63,152, బంగారం 63.45 గ్రాములు, వెండి 850.10 గ్రాములు, విదేశీ కరెన్సీ అమెరికన్ డాలర్లు 92, సింగపూర్ డాలర్లు 12, ఇంగ్లాండ్ ఫౌండ్స్ 230, ఒమెన్ రియాల్స్ 10 , యుఎఇ దిర్హమ్స్ 10 ఉన్నాయని ఉప కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కె.శిరీష తెలిపారు. ఈ లెక్కింపులో ధర్మకర్తల మండలి చైర్మన్ కె.సింహాచలం, ధర్మకర్తలు బొడిలపాటి సత్యరూపవాణి, బి.అనురాధ, ఎన్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, కె.రాజేంద్రకుమార్, టి.రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

అటవీశాఖ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

- సిసిఎఫ్ శ్రీకంఠనాథ రెడ్డి

ప్రజాశక్తి - ఆరిలోవ :అటవీశాఖ అధికారులు, సిబ్బంధి అంకితభావంతో పనిచేయాలని విశాఖ సర్కిల్ సిసిఎఫ్ శ్రీకంఠనాథ రెడ్డి అన్నారు. సోమవారం ఇందిరాగాంధీ జులాజికల్ పార్కులో అటవీశాఖ, ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీశాఖ అధికారులకు, సిబ్బందికి ఘననివాళులర్పించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని పరిరక్షించడంలో పర్యావరణ వ్యవస్థల పాత్ర ప్రాముఖ్యతనుకొనియాడారు. జంతువుల పట్ల భక్తిభావంతో, సేవాదృక్పదంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సహచర జీవరాశులు లేకపోతే మనిషి మనుగడ లేదన్న నిజాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి అనంత శంకర్, జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, అసిస్టెంట్ క్యూరేటర్స్ గోపి, గోపాలనాయుడు, సెక్షన్ అధికారులు భారతి, రేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ అవగాహన నివేదిక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: దేశంలో అత్యంత విశ్వసనీయమైన ప్రైవేట్ జీవిత బీమా సంస్థలలో ఒకటైన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, వినియోగదారుల అధ్యయనానికి 'ఫైనాన్షియల్ ఇమ్యూనిటీ స్టడీ 3.0' ను సోమవారం సిరిపురంలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండి మహేష్‌కుమార్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల ఆర్థిక భద్రతకు, వారిలో ఉన్న అపోహలను తొలగించడానికి ఈ అధ్యయనం దోహదపడుతుందన్నారు. ఎస్‌బిఐ లైఫ్ నాలెడ్జ్ భాగస్వామి డెలాయిట్ సహకారంతో దీన్ని ప్రారంభించిందన్నారు. దేశంలో 41 నగరాల్లోని ఐదు వేలమంది స్పందనలను, ఫైనాన్షియల్ ఇమ్యూనిటీ భావనను ప్రజల్లోకి తీసుకువెళ్తూ ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ఎంచుకునే ఆవశ్యకతను విశదీకరిస్తుందన్నారు.

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణకు సిద్ధమా?

- చంద్రబాబుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సవాల్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ.: ఆదాయానికి మించిన ఆస్తులు కేసులో విచారణను ఎదుర్కొనేందుకు చంద్రబాబు సిద్ధంగా ఉన్నాడా? అని రాష్ట్రమంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. సోమవారం సర్క్యూట్ హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ, 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా, అంతకు ముందు మంత్రిగా పనిచేసిన సమయంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు చివరికి నాయుడు చట్టానికి దొరికిపోయాడన్నారు. ఏం చేసినా చెల్లుబాటవుతుందని అనేక నేరాలకు పాల్పడి అడ్డంగా దొరికిపోయారన్నారు. అవినీతికి పాల్పడి ఎపిలో జైలుకెళ్లిన ఏకైక మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2014-19 వరకు ఏలేరు, భారత్ ఐజిఎం, స్టాంపులు ఇలా అనేక కుంభకోణాలు, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు, తర్వాత అమరావతి పేరిట భూకుంభకోణాలకు తెరతీసాడని, పట్టిసీమ, పోలవరం, ఫైబర్‌నెట్, స్కిల్ డెవలప్మెంట్ స్కామ్‌లకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుత స్కాంలో రూ. 371 కోట్లను షెల్ కంపెనీలకు తరలించారన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ సోమవారం బంద్ విజయవంతంగా జరిగిందని లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బంద్‌కు చంద్రబాబు తోడు దొంగలు తప్ప, వేరేవరూ సంఘీభావం తెలపలేదన్నారు.

ఇండియన్ బ్యాంక్ మర్రిపాలెం శాఖ ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగరంలోని మర్రిపాలెంలో ఇండియన్ బ్యాంక్ 50వ నూతనశాఖను విజయనగరం మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు, బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్, గణేశరామన్, సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ, ఇండియన్ బ్యాంక్‌తో తమకున్న అనుబంధాన్ని వివరించారు. ఇండియన్ బ్యాంక్ అందిస్తున్న సేవలపై తమ అనుభవాలను వ్యక్తం చేశారు. అనంతరం ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేశరామన్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.11 లక్షల కోట్లు దాటిందన్నారు. బ్యాంకింగ్ సేవలకు సంబంధించి అన్ని పేరామీటర్లలో ఎపిజిఎంఒ హైదరాబాద్ ఒకటో స్థానంలో నిలిచిందన్నారు.

జోనల్ మేనేజర్ వెంకట రమణారావు మాట్లాడుతూ విశాఖపట్నం జోన్ పరిధిలో ఇండియన్ బ్యాంక్ సేవలను వివరించారు. జోన్ పరిధిలో బ్యాంకు లావాదేవీలు రూ.9600 కోట్లు దాటినట్లు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇండియన్ బ్యాంక్ విశాఖపట్నం జోన్ ఎంఎస్ఎంఇ లకు రూ.50 కోట్లు, వ్యవసాయ, బంగారు రుణాలకు రూ.82కోట్లు పైబడి లావాదేవీలు నిర్వహించిందన్నారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్న వారందరికీ మర్రిపాలెం శాఖ బ్రాంచి మేనేజర్ ఎ.కృష్ణచైతన్య ధన్యవాదాలు తెలిపారు. నగరంలోనిపలు బ్యాంక్ శాఖల మేనేజర్లు, సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు,ఖాతాదారులు హాజరయ్యారు.

త్రోబాల్ పోటీలలో బీపీ కల్లాలు టీం ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం: ఈషా ఫౌండేషన్ నిర్వహించిన అంతర జిల్లాల మహిళల త్రోబాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. కోయంబత్తూరులో నిర్వహించనున్న అంతర రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రన్నరప్‌గా నిలిచిన బిపి.కల్లాలు జట్టుకు ఐఎఎస్ అధికారి ఇషా చౌదరి బహుమతులను అందజేశారు. అంతరరాష్ట్ర పోటీలకు ఎంపికైన బిపి.కల్లాలు జట్టు సభ్యులకు పంచాయతీ పాలకమండలితోపాటు స్థానికులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.